
ఆంధ్రజ్యోతి
andhrajyothy.com
కామారెడ్డి
జిల్లా వార్తలు
5
శనివారం 1 నవంబరు 2025



నేడు మండల అంతర్ పాఠశాలల క్రీడలు ప్రారంభం

మాచారెడ్డి, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): మాచారెడ్డి మండల అంతర్ పాఠశాలల క్రీడలు శనివారం ప్రారంభం కానున్నట్లు కన్వీనర్ వెంకటాచారి శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొదటి రోజు మార్చ్‌ఫాస్ట్, వాలీబాల్, 2న ఖోఖో, 3న కబడ్డీ పోటీలను నిర్వహించి గెలిచిన జట్లకు బహుమతులు అందజేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమ ప్రారంభానికి ఏఎస్పీ చైతన్యరెడ్డి, డీఈవో రాజు హాజరవుతారని తెలిపారు.

గ్రామీణ స్థాయిలో మహిళా సంఘాలు బలపడితే గ్రామాభివృద్ధి



ఐకేపీ సమావేశంలో మాట్లాడుతున్న భారతి

రాజంపేట, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): గ్రామీణ స్థాయిలో మహిళల సంఘాలు బలపడితే గ్రామ అభివృద్ధి జరుగుతుందని స్టేట్ ప్రాజెక్టు మేనేజర్ భారతి తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలోని స్వయం సహాయక సంఘాల బలోపేతం కోసం శిక్షణ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండల సమైక్య సమావేశాలను ప్రతీనెల ఏ రకంగా నిర్వహించుకుంటారో అదే రకంగా వారు నిర్వహించుకునే విధానం పలు సూచనలు సలహాలు చేయడం కోసం ఈ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందన్నారు. రెండు రోజులు శిక్షణ కార్యక్రమం ఉంటుందని మొదటి రోజు శిక్షణ కార్యక్రమంలో జిల్లా సీనియర్ కమ్యూనిటీ ట్రైనర్ బి. జ్యోతి, ఎన్.సరళ హాజరయ్యారు. రోజంతా ఈ శిక్షణ కార్యక్రమాల గురించి పూర్తిస్థాయిలో వారికి చాలా విషయాలు సూచించామన్నారు. స్వయం సహాయక సంఘాల ట్రైనింగ్ ప్రోగ్రామ్ ద్వారా మహిళలు ఎలా ఆర్థికంగా, సామాజికంగా ఎదగవచ్చో వివరించారన్నారు. గ్రామీణ స్థాయిలో మహిళల సంఘాలు బలపడితే గ్రామ అభివృద్ధి స్వయంగా జరుగుతుందని తెలిపారు. మహిళా సంఘాలు తమ గ్రామ సమస్యలను పరిష్కరించడంలో కీలక పాత్ర పోషించాలని సూచించారు. విద్య, ఆరోగ్యం, స్వచ్ఛత, పర్యావరణ పరిరక్షణలో కూడా మహిళలు ముందుండాలన్నారు. ప్రభుత్వ పథకాలను గ్రామ స్థాయికి తీసుకువెళ్లడంలో మహిళా సంఘాల పాత్ర చాలా ముఖ్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల సమాఖ్య అధ్యక్షురాలు సుతారి లక్ష్మీ, ఏపీఎం రాజారెడ్డి, సీసీలు సాయిలు, సాయిబాబా పాల్గొన్నారు.



ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్ నాయకులు

ఎమ్మెల్యే పోచారం రాజీనామా చేయాలి

» బోర్లంలో బీఆర్ఎస్ కార్యకర్తల డిమాండ్

బాన్సువాడ రూరల్, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): బాన్సువాడ మండలంలోని బోర్లం గ్రామంలో శుక్రవారం పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయడానికి వచ్చిన ప్రభుత్వ సలహాదారు, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డికి నిరసన సెగ తగిలింది. గ్రామానికి వచ్చిన పోచారం కారుకు అడ్డుపడి కారు గుర్తుతో గెలిచి రాజకీయ స్వార్థం కోసం కాంగ్రెస్‌లో చేరడం సిగ్గుచేటని, వెంటనే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని ప్లకార్డులు చేతబట్టి బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు నినాదాలు చేశారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులు వారిని శాంతిపరిచేందుకు ప్రయత్నాలు చేసిన వారు వినిపించుకోలేదు. పోచారం ఏ పార్టీలో ఉన్నారో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. సమాధానం చెప్పే వరకు కదిలేది లేదని భీష్మించుకు కూర్చోవడంతో కొద్దిసేపు అక్కడ ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. అనంతరం పోలీసులు జోక్యం చేసుకుని బీఆర్ఎస్ కార్యకర్తలను పోలీసుస్టేషన్‌కు తరలించడంతో గ్రామంలో రూ.70లక్షలతో సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణానికి పోచారం శంకుస్థాపన చేశారు.

పోషణ లోపం లేని జిల్లాగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తా..

» డీడబ్ల్యువో ప్రమీల

కామారెడ్డి టౌన్, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): పోషణ లోపం లేని జిల్లాగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని డీడబ్ల్యువో ప్రమీల అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో పోషణ మాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోషణ లోపం కలిగిన చిన్నారులకు ఆరోగ్య పరీక్షలు చేయాలన్నారు. పిల్లల అభివృద్ధి పర్యవేక్షణ మేరకు, ఎన్‌హెచ్‌టీఎస్ యాప్‌లో ఐసీడీఎస్ శాఖ, ఏసీహెచ్ పోర్టల్‌లో ఆరోగ్యశాఖకు సంబంధించిన వారికి పరీక్షలు నిర్వహించి ఎంట్రీ చేయాలన్నారు. సామ్, మామ్ పిల్లలకి ఆరోగ్యానికి సంబంధించిన తగు సూచనలు, సలహాలు ఇవ్వాలని తెలిపారు.

బస్తాకు.. రూ.100 నష్టం

» తేమ, తరుగు పేరిట ధాన్యం కోత
» బస్తాకు 3 నుంచి 5 కిలోల వరకు తగ్గింపు
» నిలువునా నష్టపోతున్న ధాన్యం రైతులు
» తేమ శాతం రాక రోజుల తరబడి ఆరబెడుతున్న వైనం
» జిల్లాలో ఇప్పటి వరకు 32,503 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు



రోడ్డుపై వరి ధాన్యం ఆరబోసిన దృశ్యం

ఆరుగాలం కష్టపడి పంటలు సాగు చేసి పండించిన ధాన్యాన్ని అమ్ముకునేందుకు అన్నదాతలకు ఇబ్బందులు తప్పడం లేదు. సాగు చేసింది మొదలు పంట విక్రయించే వరకు అన్నదాతలు ఆగమవుతునే ఉన్నారు. సకాలంలో కొనుగోలు లేక పట్టించుకునే వారు కానరాక రైతులు దిక్కుతోచని పరిస్థితుల్లో కొట్టుమిట్టాడుతున్నారు. అకాల వర్షాలతో ధాన్యం తడిసిపోతుండడం, తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని ప్రభుత్వం ఓ వైపు చెబుతున్నా మిల్లర్లు మాత్రం తీసుకోవడం లేదు. ప్రధానంగా తేమ శాతం విషయంలో కొన్ని చోట్ల కేంద్రాల నిర్వాహకులు, మిల్లర్లు కొర్రీలు పెడుతున్నారు. చాలా చోట్ల నిర్దేశిత 17 కంటే తక్కువ తేమ శాతం ఉన్నప్పటికీ కొనుగోలు చేయడం లేదు. నిర్దేశిత తేమ శాతం వస్తున్నా కాంటాపెట్టే పరిస్థితులు లేకపోవడంతో కేంద్రాల్లో, రోడ్లపై కుప్పలు ఎక్కడికక్కడే దర్శనమిస్తున్నాయి.

కామారెడ్డి, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): కొనుగోలు కేంద్రంలో తూకం వేసిన తర్వాత రైస్‌మిల్లుకు వెళ్తే 40కిలోల బస్తాపై 3 నుంచి 5 కిలోల వరకు కోత విధిస్తున్నట్లు రైతులు ఆరోపిస్తున్నారు. కొన్ని కొనుగోలు కేంద్రాల్లో రైస్‌మిల్లర్లతో ఒప్పందాలు చేసుకుని తూర్పారా పట్టకుండా సంచికి మూడు కేజీల కోత విధిస్తున్నట్లు తెలుస్తోంది. తూర్పారా పట్టి నాణ్యమైన ధాన్యం పంపించిన మిల్లర్లు ఖచ్చితంగా సంచిపై రెండు నుంచి నాలుగు కేజీల కోత విధిస్తే తమకు ఫిర్యాదు చేయాలని స్వయాన అధికారులు సూచిస్తున్నారు. తరుగు పేరిట రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. సుమారు 3 నుంచి 5 కిలోల వరకు బస్తాకు తరుగు తీస్తుండడంతో రైతులు సంచికి రూ.100కు పైగా నష్టపోతున్నారు.

తేమ ప్రధాన అడ్డంకి

రైతులు హార్వెస్టర్‌తో వరి కోతలు చేపడుతున్నారు. అకాల వర్షాలకు ధాన్యం తడుస్తుండడంతో తేమ అధికంగా ఉంటోంది. నిబంధనల ప్రకారం 17 శాతం తేమ ఉండాలి. కానీ 30 శాతానికి తక్కువగా నమోదు కావడం లేదు. కొనుగోలు కేంద్రాల్లో వడ్లు ఆరబెట్టే పరిస్థితి కూడా లేదు. ఉన్న కొద్దిపాటి స్థలంతో పాటు రోడ్లపై రైతులు వడ్లు నేర్పుతున్నారు. అకాల వర్షాలతో మరింత తేమ చేరుతుందని ఉద్దేశ్యంతో సాయంత్రం కుప్పగా పోసి దానిపై కవర్లు కప్పుతున్నారు. దీనికి తోడు నాణ్యతగా ఉన్న ధాన్యం కుప్పను కూడా ప్యాడీ క్లీనర్ ద్వారా తూర్పార పట్టాలని నిర్వహకులు హుకూం జారీ చేయడం రైతులకు ఇబ్బందిగా మారుతోంది. ఒక్కో కేంద్రంలో దాదాపు 20 క్వింటాళ్లకు పైగానే ధాన్యం ఉండడం, ప్యాడీ క్లీనర్‌లు సరిపడా లేకపోవడంతో వడ్లను శుభ్రం చేసేందుకు చాలా రోజుల సమయం పడుతోంది. హమాలీల కొరత, లారీలు రాకపోవడంతో సకాలంలో ధాన్యం లోడ్ కావడం లేదు. చాలా కేంద్రాల్లో రోజుకు ఒక్కలారీ కూడా మిల్లుకు వెళ్లడం లేదు.

32 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు

జిల్లాలోని కామారెడ్డి, ఎల్లారెడ్డి, బాన్సువాడ డివిజన్‌ల పరిధిలో ఈ యాసంగి సీజన్‌లో ధాన్యం కొనుగోళ్లకై 427 కేంద్రాలను ఏర్పాటు చేశారు. దాదాపు గత 20 రోజుల నుంచి ధాన్యం కొనుగోలు చేపడుతున్నారు. జిల్లాలో అకాల వర్షాలు కురుస్తుండడంతో కొనుగోలు కేంద్రాల్లోని పంట పొలాల్లోని కల్లాల్లో ఉన్న ధాన్యం తడిసిపోతుండడంతో కొనుగోళ్లలో ఆటంకాలు ఎదురవుతున్నాయి. ప్రతీరోజు 10 వేల నుంచి 15 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేస్తున్నట్లు సంబంధిత శాఖ అధికారులు చెబుతున్నారు. ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా 3,735 మంది రైతుల నుంచి రూ.63 కోట్ల విలువ చేసే 32 వేల 503 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశారు. ఇందులో రూ.8 కోట్ల ధాన్యం డబ్బులను ఆయా రైతుల ఖాతాల్లో జమ చేశారు.

అనుమతి లేని ల్యాబ్‌లను గుర్తించండి

» జిల్లా వైద్యాధికారి చంద్రశేఖర్

పెద్ద కొడప్‌గల్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఆయా మండలాల్లో నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న ల్యాబ్‌లను గుర్తించాలని జిల్లా వైద్యాధికారి చంద్రశేఖర్ మండల వైద్యాధికారులకు ఆదేశాలు జారీ చేశారు. శుక్రవారం 'ఆంధ్రజ్యోతి' జిల్లా పేజీలో 'ల్యాబ్.. డబ్బు' కథనం ప్రచురితం కావడంతో స్పందించిన జిల్లా వైద్యాధికారి అనుమతి లేని ల్యాబ్‌లను గుర్తించాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా వైద్యాధికారి చంద్రశేఖర్ మాట్లాడుతూ జిల్లాలో 38 ల్యాబ్‌లు అనుమతి పొందినవి ఉండగా, వివిధ మండలాల్లో మరో 7 ల్యాబ్‌లు అనుమతి కోసం దరఖాస్తు చేసుకున్నాయని తెలిపారు. ఇక జిల్లాలో అనుమతి లేకుండా ఉన్న ల్యాబ్‌లను గుర్తించాలని మండల వైద్యాధికారులకు ఆదేశాలు జారీ చేశారు. దీంతో పాటుగానే ల్యాబ్‌లలో గల సౌకర్యాలు వాటి వివరాలు గుర్తించాలన్నారు. జిల్లాలో అనుమతి ఉంటేనే ల్యాబ్‌లు నిర్వహణ చేయాలని స్పష్టం చేశారు.

లైన్ క్లియర్



మదన్‌మోహన్‌రావు



షబ్బీర్‌అలీ

» మదన్‌మోహన్‌కు మంత్రి పదవిపై చిగురిస్తున్న ఆశలు
» పోటీగా ఉన్న ఇద్దరు ఎమ్మెల్యేలకు నామినేటెడ్ పదవుల కేటాయింపు
» చివరకు షబ్బీర్‌అలీ ఆశలు గల్లంతు
» త్యాగం చేసినా దక్కని మంత్రి యోగం
» ప్రభుత్వ సలహాదారుడి పదవితో అసంతృప్తి

కామారెడ్డి, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావుకు మంత్రి పదవికి లైన్ క్లియర్ అయినట్లు పార్టీ వర్గాల్లో చర్చ సాగుతోంది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తి చేసుకోవడమే కాకుండా రెండు పర్యాయాలు మంత్రివర్గ విస్తరణను చేపట్టింది. ఇందులో ఉమ్మడి నిజామాబాద్ జిల్లా నుంచి ఎవరికి అవకాశం దక్కలేదు. రెండో విడత మంత్రివర్గ విస్తరణలో నిజామాబాద్ లేదా కామారెడ్డిలోని ఎవరికో ఒకరికి మంత్రి పదవి దక్కుతుందని అంతా ఆశించినా నిరాశే మిగిలింది. దీనికి ప్రధానంగా సామాజిక సమీకరణాల నేపథ్యంలో ముఖ్యనేతల మధ్య పోటీ నెలకొనడం అయితే తాజాగా ఉమ్మడి జిల్లాలో పోటీగా ఉన్న సుదర్శన్‌రెడ్డికి క్యాబినెట్ ర్యాంక్‌తో కూడిన ప్రభుత్వ సలహాదారుడిగా కేటాయించడంతో మరో విడతలో మంత్రివర్గ విస్తరణ చేపడితే మదన్‌మోహన్‌కు మంత్రి యోగం దక్కే అవకాశం ఉందని తెలుస్తోంది. అయితే మరో సీనియర్ నేత షబ్బీర్‌అలీకి మంత్రి పదవి ఆశలు గల్లంతు అయినట్లే. మైనార్టీ కోటలో అజారొద్దీన్ ప్రమాణస్వీకారం చేశారు. ఇక షబ్బీర్‌అలీ ప్రభుత్వ సలహాదారుడి పదవితోనే సరిపెట్టుకోవాల్సిందే.

మంత్రి రేసులో మదన్‌కు పోటీ లేనట్లేనా?

ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోనే భారీ మెజార్టీతో గెలుపొందిన ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు మంత్రి పదవి కోసం తీవ్ర ప్రయత్నాలే చేస్తున్నారు. గత రెండు విడతల మంత్రివర్గ విస్తరణలో మదన్‌మోహన్‌కు చోటు దక్కుతుందని అంతా భావించారు. కానీ పోటి నేపథ్యంలో ఆయనకు అవకాశం దక్కలేదు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లా నుంచి మంత్రి రేసులో బోధన్ ఎమ్మెల్యే మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్‌అలీ, ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు పోటీ పడ్డారు. ఈ ముగ్గురి నుంచి ఎవరికో ఒకరికి రెండో విడతలో మంత్రి పదవి వస్తుందని ఆశించినా పదవి దక్కకపోవడంతో నిరాశే మిగిలింది. వెల్మ సామాజిక వర్గం నుంచి మొదటి విడత మంత్రి వర్గంలో జూపల్లి కృష్ణారావుకు అవకాశం కల్పించారు. రెండో విడతలో మరొకరికి వెల్మ నుంచి అవకాశం కల్పించాలని అధిష్ఠానం నిర్ణయించడంతో ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావుతో పాటు ఆదిలాబాద్‌లోని ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్ రావు ఇద్దరి మధ్య పోటీ నెలకొంది. అయితే ఎమ్మెల్యే మదన్‌మోహన్‌తో పోటీగా ఉన్న సుదర్శన్‌రెడ్డి, ప్రేమ్‌సాగర్‌రావులకు తాజాగా నామినేటెడ్ పదవులను కట్టబెట్టింది. సుదర్శన్‌రెడ్డికి క్యాబినెట్ హోదాను కల్పిస్తూ ఆరు గ్యారెంటి పథకాల సలహాదారుడిగా, ఆదిలాబాద్ ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్ రావుకు సివిల్ సప్లయ్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమించారు. వీరిద్దరికి పదవులు దక్కడంతో మలివిడత మంత్రి వర్గంలో ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావుకు అమాత్య యోగం పై లైన్ క్లియర్ అయినట్లేనని పార్టీ వర్గాల్లోనే కాకుండా ఆయన అనుచర వర్గంలో చర్చ సాగుతోంది. అదేవిధంగా మదన్‌మోహన్‌కు ఏఐసీసీ అగ్రనేతలతో మంచి సత్స సంబంధాలు ఉండడం రాహుల్‌గాంధీకి అత్యంత సన్నిహితుడు కావడం మదన్‌మోహన్‌కు మంత్రి పదవి వచ్చే అవకాశం (మిగతా 8లో..)



ధాన్యాన్ని పరిశీలిస్తున్న అధికారులు

మొలకెత్తిన ధాన్యాన్ని రైస్‌మిల్‌కు తరలిస్తాం

» జిల్లా అధికారి వెంకటేశ్వరరావు

భిక్కనూరు, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): బాన్సువాడ మండలంలోని కోనాపూర్, సంగోజీపేట్, హన్మాజీపేట్, ఇబ్రహీంపేట్ గ్రామాల్లో శుక్రవారం జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారులు గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాల వల్ల రైతులు కొనుగోలు కేంద్రాల్లో ఆరబెట్టిన ధాన్యాన్ని జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి వెంకటేశ్వరరావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ధాన్యాన్ని ఆరబెట్టి 17 శాతం తేమ వచ్చిన తరువాతనే ధాన్యాన్ని కొనుగోలు చేసి రైస్‌మిల్‌కు తరలించాలన్నారు. తేమ శాతం ఎక్కువగా ఉండి తడిసిన, మొలకెత్తిన ధాన్యాన్ని బాయిల్డ్ రైస్‌మిల్‌కు తరలించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు.



సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎస్పీ రాజేష్‌చంద్ర

భారత ఐక్యతకు ప్రతీక పటేల్

కామారెడ్డి టౌన్, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): భారత ఐక్యతకు ప్రతీకగా సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ నిలిచాడని ఎస్పీ రాజేష్‌చంద్ర అన్నారు. శుక్రవారం జాతీయ ఐక్యత దినోత్సవం సందర్భంగా రన్ ఫర్ యూనిటి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. డీఎస్పీ కార్యాలయం నుంచి జీవదాన్ స్కూల్ సమీపంలోని సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ విగ్రహం వరకు 2 కే రన్ నిర్వహించి పూలమాల వేశారు. దేశంలోని రాష్ట్రాలన్నీ ఒకే తాటిపైకి తెచ్చి ఐక్యతకు ప్రతీకగా నిలిచినమహానుభావుడని అన్నారు. ఆయన స్ఫూర్తితో మనం సమాజంలో ఐక్యత, సామరస్యం నెలకొల్పాలని తెలిపారు. శాంతి భద్రతల పరిరక్షణతో పాటు జాతీయ స్ఫూర్తిని పెంపొందించడంలో పోలీసుశాఖ ఎల్లప్పుడు ముందుంటుందని ఎస్పీ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలి

» ఎల్లారెడ్డి ఆర్డీవో పార్థ సింహారెడ్డి



గోపాల్‌పేట్ కొనుగోలు కేంద్రం వద్ద ధాన్యాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో

నాగిరెడ్డిపేట, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ గ్రామాల్లో సొసైటీలు, ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని ఎల్లారెడ్డి ఆర్డీవో పార్థసింహారెడ్డి సొసైటీల సీఈవోలను, ఐకేపీ సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం ఆయన మండలంలోని గోపాల్‌పేట్, తాండూర్ గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులు ఆరబెట్టిన ధాన్యాన్ని ఆయన పరిశీలించారు. ధాన్యం తేమ శాతాన్ని పరిశీలించారు. 17 శాతం కంటే తక్కువ తేమ శాతం ఉన్న రైతుల ధాన్యాన్ని వెంట వెంటనే తూకం వేసి లారీల్లో లోడింగ్ చేసి రైస్‌మిల్లులకు తరలించాలని ఆయన సిబ్బందిని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు విషయంలో ఏమైనా ఇబ్బందులు ఉంటే తమ దృష్టికి తేవాలని వాటిని వెంటనే పరిష్కరిస్తామని ఆయన రైతులకు తెలిపారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలని ఆయన సిబ్బందిని ఆదేశించారు. తాండూర్ గ్రామంలోని సబ్ సెంటర్‌ను, అక్కంపల్లి గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. అలాగే తాండూర్ గ్రామంలో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇంటి నిర్మాణం పనులను ఆర్డీవో పరిశీలించారు. ఇందిరమ్మ ఇంటి నిర్మాణాలు త్వరగా పూర్తయ్యేలా తగు చర్యలు తీసుకోవాలని ఆయన సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో స్థానిక తహసీల్దార్ శ్రీనివాస్ రావు, ఎంపీవో ప్రభాకర్ చారి, ఆర్ఐ మహ్మద్, రైతులు తదితరులు ఉన్నారు.

షూటింగ్ స్పాట్‌గా సిద్ధరామేశ్వర ఆలయ మెట్ల బావి
» ఉదయం నుంచి కొనసాగిన వెబ్ సిరీస్ షూటింగ్
» తిలకించేందుకు పెద్దఎత్తున తరలివచ్చిన స్థానికులు
వివరాలు 7లో..

గాలికుంటుకు తప్పదు.. భారీ మూల్యం
» పశువుల్లో వ్యాపిస్తున్న వ్యాధి
» నిర్లక్ష్యం చేస్తే ప్రమాదమే
» నివారణ చర్యలు పాటిస్తే మేలు
6



ఇందిరాగాంధీ చిత్రపటం వద్ద నివాళ్లు అర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఇందిరాగాంధీకి ఘన నివాళి

కామారెడ్డి టౌన్, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం కామారెడ్డిలో ఇందిరాగాంధీ వర్ధంతి సందర్భంగా ఆమెకు ఘన నివాళ్లు అర్పించారు. జిల్లా పార్టీ కార్యాలయం వద్ద నాయకులు, నియోజకవర్గ కార్యాలయం వద్ద టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడ్డం చంద్రశేఖర్‌రెడ్డి ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. దేశంలో ప్రధాన మంత్రిగా చేసిన సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేద, బడుగు బలహీన ప్రజలకు ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి ఆదుకున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు గోనె శ్రీనివాస్, గుడుగుల శ్రీనివాస్, కోయిలకర్ కన్నయ్య, రమేష్, మహేష్, శంకర్‌రావు, జూలూరి సుధాకర్, శ్రీనివాస్‌యాదవ్, పంపరి లక్ష్మణ్, అంజద్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

క్రైం సమాచారం

ప్రైవేటు ఆస్పత్రిలో శిశువు మృతి

ఇందూరు, అక్టోబర్ 31, (ఆంధ్రజ్యోతి) : వైద్యుల నిర్లక్ష్యం కారణంగా జిల్లాకేంద్రంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో అప్పుడే పుట్టిన శిశువు మృతిచెందింది. కామారెడ్డి జిల్లా నిజాంసాగర్‌కు చెందిన అసిఫ్ తన భార్య సల్మాను డెలివరీ కోసం ప్రైవేటు ఆస్పత్రికి తీసుకురాగా ఇద్దరు కవలలు జన్మించారు. వారిలో ఒకరు 700గ్రాములు, మరొకరు ఒకటిన్నర కిలోలు పుట్టారు. 700గ్రాములు పుట్టిన శిశువు ఆరోగ్యం సరిగా లేకపోవడంతో హైదరాబాద్ నిలోఫర్ ఆస్పత్రికి తరలించగా.. అక్కడ చికిత్స పొందుతూ ఆ శిశువు మృతిచెందగా.. మరో శిశువు ఇక్కడ ఆస్పత్రిలో చికిత్స పొందుతుంది. మరో శిశువు ఆరోగ్యం విషమంగా ఉందని హైదరాబాద్ తీసుకెళ్లాలని ఇక్క డి వైద్యులు చెప్పగా ఆ ఏర్పాట్లలో ఉండగా ఆ శిశువు కూడా మృతిచెందింది. వైద్యుల నిర్లక్ష్యం వల్లే ఇద్దరు శిశువులు మృతిచెందారని ఆసిఫ్ ఆరోపించగా.. తమ నిర్లక్ష్యమేమి లేదని నెలలు నిండకుండా పుట్టిన పిల్లల విషయంలో గ్యారంటీ ఉండదని ఆస్పత్రి యాజమాన్యం వెల్లడించింది.

లింగాపూర్‌లో ఆత్మహత్య లేఖ కలకలం

నవీపేట,అక్టోబరు31(ఆంధ్రజ్యోతి): నా చావుకు కారణం భార్య కవితతో పాటు పలువురు అత్తగారి కుటుంబ సభ్యులే కారణమని ఇటీవల వాగులో దూకి ఆత్మహత్య చేసుకున్న మండలంలోని లింగాపూర్‌కు చెందిన గంధం సాయిలు(36) లేఖ కుటుంబ సభ్యులకు లభ్యం కాగా శుక్రవారం సంబంధిత లేఖను నవీపేట పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్పీ, ఎస్‌లను ఉద్దేశించి రాసిన లేఖలో తాను 13 ఏళ్ల పాటు దుబాయ్‌లో ఉండి సంపాదించిన డబ్బులను తన భార్య కవిత సరిగా లెక్కలు చెప్పడం లేదన్నారు. ఇటీవల ఆర్మూర్‌లోని పిప్రిలోని తన పుట్టింటికి వెళ్లిన ఆమె ఆర్మూర్ పోలీస్ స్టేషన్‌లో తనపైనే కేసు పెట్టిందని వాపోయాడు. తన భార్య ఆర్మూర్‌లో ఒక ప్లాట్ కొన్నదని, పిప్రిలో రూ.3లక్షల చిట్టి వేసిందని లేఖలో ఉందన్నారు. స్థానికంగా ఉన్న ఇల్లు కూడా తన భార్య పేరుమీదనే ఉందని, ఇప్పుడు భార్య తనకు విడాకులు ఇస్తానని అంటుందని లేకపోతే చచ్చిపోమ్మని బెదిరించిందని లేఖలో పేర్కొన్నాడు. తన చావుకు కారణంగా భార్య కవితతో పాటు ఆమె కుటుంబానికి చెందిన పలువురు కారణమని వారిని చట్టప్రకారం శిక్షించాలని వేడుకున్నాడు. ఈ లేఖపై ఎస్‌ఐ తిరుపతిని వివరణ కోరగా.. సాయిలు రాసినట్టుగా పేర్కొంటున్న లేఖను శుక్రవారం తాము స్వాధీనం చేసుకున్నామని.. ఈ లేఖను అతడే రాశాడా లేక మరెవరైన రాశారా అనే విషయంపై విచారణ జరుపుతున్నామన్నారు.

మహిళపై లైంగిక దాడి.. నిందితుడి అరెస్టు

కామారెడ్డిటౌన్,అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): మహిళపై లైంగిక దాడికి పాల్పడిన నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు ఎస్పీ రాజేష్ చంద్ర తెలిపారు. శుక్రవారం ఎస్పీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. పాల్వంచ మండలంలోని పరిదీపేట్ గ్రామానికి చెందిన ఓ మహిళ వ్యవసాయ పొలంలో పనుల నిమిత్తం వెళ్లగా కొచ్చేరువు ప్రాంతానికి చేరుకోగానే వెనుక నుంచి ఒక వ్యక్తి దాడిచేశాడు. ఆమె కింద పడగానే పొదలలోకి లాక్కెళ్లి అరుపులు, కేకలు వేయకుండా నోరుమూసి బలవంతంగా ఆమెపై లైంగిక దాడికి పాల్పడి పారిపోయాడు. బాధిత మహిళ మాచారెడ్డి పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు ఇవ్వగా కేసు నమోదుచేసుకోని దర్యాప్తు చేపట్టామని తెలిపారు. ఓ రైస్‌మిల్‌లో పనిచేసే బిహార్ రాష్ట్రానికి చెందిన రాహుల్‌కుమార్ లైంగిక దాడికి పాల్పడి పరారయ్యాడని గుర్తించి ఏఎస్పీ చైతన్యరెడ్డి ఆధ్వర్యంలో 7 ప్రత్యేక బృందాలతో గాలింపు చర్యలు చేపట్టామన్నారు. విచారణలో మహారాష్ట్రలోని గొండియా జిల్లాలో ఉన్నట్లు గుర్తించి చాకచక్యంగా పట్టుకున్నట్లు తెలిపారు. ఈ కేసు ఛేదనలో సఫలీకృతమైన కామారెడ్డి రూరల్ సీఐ రామన్, సీసీఎస్ సీఐ శ్రీనివాస్, ఎల్లారెడ్డి సీఐ రాజారెడ్డి, వీసీఆర్ సీఐ నరేష్, మాచారెడ్డి, దేవునిపల్లి, గాంధారి ఎస్‌ఐలను ఎస్పీ అభినందించారు.

మహిళ ఆత్మహత్య

నాగిరెడ్డిపేట,అక్టోబరు31(ఆంధ్రజ్యోతి): మండలంలోని చీనూర్ గ్రామానికి చెందిన అంజవ్వ(52) ఆత్మహత్య చేసుకున్నట్లు ఇన్‌చార్జి ఎస్ హెచ్‌వో మనోహర్‌రావ్ తెలిపారు. అంజవ్వ కొంతకాలం నుంచి అనారోగ్యం తో బాధపడుతోందని గురువారం రాత్రి జీవితంపై విరక్తి చెంది బావిలో దూకిందన్నారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

వడ్ల లోడ్ లారీ బోల్తా

డొంకేశ్వర్, అక్టోబరు31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దత్తాపూర్, మారంపల్లి ప్రధాన రహదారి వద్ద శుక్రవారం సాయంత్రం అదుపుతప్పి వడ్ల లోడుతో వెళ్తున్న లారీ బోల్తా పడింది. మారంపల్లి నుంచి హైదరాబాద్‌కు వెళ్తుండగా.. అదుపుతప్పి పొలాల్లో పడింది. డ్రైవర్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. పోలీసులు ఘటనాస్థలానికి చేరుకొని పరిశీలించారు.

జాతీయ రహదారిపై ..

ఇందల్వాయి, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జాతీయ రహదారి 44పై దేవితండా వద్ద డీసీఎం బోల్తా పడింది. హైదరాబాద్ నుంచి నిజామాబాద్‌కు వెళ్తున్న డీసీఎం శుక్రవారం ఉదయం నిద్ర మత్తులో డ్రైవర్ డివైడర్‌ను ఢీకొట్టడంతో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. ఆ సమయంలో ఎదురుగా ఎలాంటి వాహనాలు రాకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పిందని స్థానికులు తెలిపారు. కాగా ఈ డీసీఎంలో డిమార్ట్‌కు సరుకులను తీసుకెళ్తున్నట్లు సమాచారం.

గంజాయి పట్టివేత...?

కామారెడ్డి రూరల్ ,అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): జిల్లాకేంద్రంలోని హైవేపై శుక్రవారం పోలీసులు 250 గ్రాముల గంజాయి పట్టుకున్నట్లు సమాచారం. గంజాయిని మహారాష్ట్ర నుంచి హైదరాబాద్ వెళ్తుండగా పోలీసులు పక్క సమాచారంతో దాడులు చేసి పట్టుకున్నారని తెలిసింది. నిందితుడి వివరాలను పోలీసులు శనివారం వెల్లడిస్తారని సమాచారం.

ప్రభుత్వ భూమిని కాపాడాలి

ఆర్మూర్ టౌన్, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): పట్టణంలో రియల్ ఎస్టేట్ వ్యాపారి కబ్జా నుంచి ప్రభుత్వ భూమిని కాపాడి అర్హులైన పేదలకు కేటాయించి ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇవ్వాలని సీపీఐ(ఎంఎల్) న్యూ డెమొక్రసీ జిల్లా సహాయ కార్యదర్శి దాసు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం ప్రభుత్వ భూమి కబ్జా విషయమై మునిసిపల్ కమిషనర్ రాజుకు ఫిర్యాదు చేశారు. పెర్కిట్‌లోని సర్వే నెంబర్ 202-3 ప్రభుత్వ భూమిని నర్సారెడ్డి అనే వ్యక్తి కబ్జా చేసి అందులో ఇళ్ల నిర్మాణాలు చేపట్టారని, ప్రభుత్వ భూమిలో ఇళ్ల నిర్మాణానికి ప్రైవేట్ వ్యక్తికి అనుమతి ఎలా ఇచ్చారని దాసు ప్రశ్నించారు. ఇప్పటికైనా ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకోవాలని లేని పక్షంలో ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో న్యూడెమొక్రసీ ఆర్మూర్ డివిజన్ నాయకులు సూర్యశివాజీ, బాలయ్య, అబ్దుల్, ప్రిన్స్, వెంకటేష్, నరేందర్, పాషా, హనుమంత్‌రెడ్డి, రాహుల్ పాల్గొన్నారు.



బీజేపీలో చేరిన వారితో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మేడపాటి ప్రకాష్‌రెడ్డి

స్థానిక సంస్థల్లో సత్తా చాటాలి

బోధన్, అక్టోబరు31 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికలలో బీజేపీ అభ్యర్థులు సత్తా చాటాలని, అభ్యర్థుల గెలుపునకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మేడపాటి ప్రకాష్ రెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో పలు గ్రామాల యువకులు పార్టీలో చేరారు. కార్యక్రమంలో బోధన్ మండల అధ్యక్షుడు సిర్ప సుదర్శన్, పట్టణ అధ్యక్షుడు గోపి కిషన్, సాలూర, ఎడపల్లి మండలాల అధ్యక్షులు గంగాధర్, ఇంద్రకరణ్, నాయకులు సాయిలు, సంజీవ్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, గంగాకిషన్, చాంద్, శ్రీనివాస్, సాయినాథ్ తదితరులు పాల్గొన్నారు.



గాలికుంటుకు తప్పదు.. భారీ మూల్యం

- పశువుల్లో వ్యాపిస్తున్న వ్యాధి
- నిర్లక్ష్యం చేస్తే ప్రమాదమే
- నివారణ చర్యలు పాటిస్తే మేలు

కమ్మర్‌పల్లి, అక్టోబరు 24, (ఆంధ్రజ్యోతి):

గాలికుంటు పశువుల్లో వ్యాపించే సీజనల్ వ్యాధుల్లో ఒకటి. ఏమాత్రం నిర్లక్ష్యం చేసినా ఈ వైరస్ ఏడాది పాటు జీవించి పశువుల ప్రాణాలు తీస్తుంది. వ్యాధి సోకితే పశువుల్లో పెరుగుదల ఆగిపోవడం, వాటి జీర్ణ వ్యవస్థపై ప్రభావం పడి పాల ఉత్పత్తి గణనీయంగా తగ్గుతుంది. ముందుగానే గుర్తించి జీవాలను కాపాడుకోవాలని కమ్మర్‌పల్లి మండల పశువైద్యాధికారి డాక్టర్ రాజేశ్వర్‌రావు సూచిస్తున్నారు. దేశవాళి పశువుల కన్న సంకరజాతి వాటితో వ్యాధి తీవ్రత అధికంగా ఉంటుందని ఆయన పేర్కొన్నారు. ఏడాదికోసారి వ్యాధి నివారణ టీకాలు వేయించాలని ఆయన సూచించారు.

గాలికుంటు వ్యాప్తికి కారణాలు..

అతి సూక్ష్మమైన అఫ్తోస్ వైరస్‌తో పశువులకు ఈ అంటువ్యాధి సోకుతుంది. పశువులకు వేసే దాన, గడ్డి, వాటి వెంట్రుకల మీద, షెడ్లలో వైరస్ ఏడాది పాటు బతికి ఉంటుంది. ఒక జీవి నుంచి మరో జీవికి వ్యాధి సోకుతుంది. యుక్త వయస్సులో ఉన్న పశువులు, వ్యాధి నిరోధకశక్తి లోపిస్తుంది. దేశవాళీ పశువుల కంటే సంకరజాతిలో ఎక్కువగా సోకుతుంది.

వ్యాధి లక్షణాలు..

- పశువుల్లో 103 నుంచి 106 ఫారెన్‌హీట్ మేర జ్వరం సోకుతుంది.
- పశువుల నోట్లో, చిగుళ్లపై పొక్కులు వస్తాయి.
- మేత మేయక ఆకలితో అలమటిస్తాయి.
- ఎద్దులు వ్యవసాయ పనులకు ఉపయోగపడవు.
- పాడి పశువుల్లో పాల ఉత్పత్తి తగ్గుతుంది. చూడి పశువుల్లో గర్భస్రావం అవుతుంది
- పశువులకు నోరు, కాలిగిట్టల మధ్య బొబ్బలు ఏర్పడతాయి.
- వ్యాధి సోకిన ఆవులు, గేదెల పాలుతాగిన దూడలు మృత్యువాతపడే అవకాశాలు

నివారణ చర్యలు..


రాజేశ్వర్, పశువైద్యాధికారి

వ్యాధి సోకిన పశువులను మందలో ఉంచకూడదు. పశువుల పాకలను పరిశుభ్రంగా ఉంచాలి. ఎన్నటికప్పుడు శుభ్రం చేయాలి. వ్యాధితో మరణించిన పశువును సున్నపు గోతిలో పూడ్చిపెట్టాలి. గాలికుంటుతో బాధపడే పశువుల పాలను దూడలకు తాగించవద్దు. అలా చేస్తే దూడలకు సోకి తక్కువ సమయంలోనే మృత్యువాత పడే అవకాశాలుంటాయి. పశువులకు తప్పనిసరిగా టీకాలు వేయించాలి. కాలి గిట్టలమధ్య ఏర్పడే పుండల్లను పొటాషియం పర్మాంగనేట్ ద్రావణంతో శుభ్రం చేయాలి. ఈగలు వాలకుండా పుండ్లపై వేప నూనె పూయాలి. జీవాల నోట్లో ఏరక్లాడిన పుండ్లకు గ్లిసరీన్, బోరిక్ పౌడర్‌ను కలిపి రాయాలి. పశువులను వైద్యశాలకు తరలించి వైద్యులు సూచించిన యాంటీ బయోటిక్స్ వాడాలి.

విద్యార్థులకు అవగాహన

కోటగిరి,అక్టోబరు31(ఆంధ్రజ్యోతి): కోటగిరి పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం పోలీసు వ్యవస్థపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. పోలీస్ స్టేషన్‌లో కేసుల నమోదు, ప్రమాదాలు జరిగిన సమయంలో పోలీసుల బాధ్యత, కేసుల నమోదు, తుపాకీ వినియోగాలపై విద్యార్థులకు ఎస్‌ఐ సునీల్ అవగాహన కల్పించారు. సమాజంలో ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలు జరిగిన సంఘటనలను చూసిన పోలీసులకు సమాచారం అందించాలని ఆయన సూచించారు.


బస్సులను తనిఖీ చేస్తున్న ఎంవీఐ రాహుల్, సీఐ సత్యనారాయణ

బస్సులను నిదానంగా నడిపించాలి

ఆర్మూర్, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రైవేట్ పాఠశాలల బస్సులను శుక్రవారం ఎంవీఐ రాహుల్ కుమార్, సీఐ సత్యనారాయణ తనిఖీ చేశారు. బస్సుల ఫిట్‌నెస్, ఇన్సూరెన్స్, ఆర్‌సీ బుక్కులను వారు పరిశీలించారు. అనంతరం బస్సు డ్రైవర్లకు రోడ్డు భద్రతా నిబంధనలపై అవగాహన కల్పించారు. స్కూల్ బస్సులలో చిన్న పిల్లలు ఉంటారన్న విషయాన్ని గమనించి, బస్సులను నినాదంగా నడాపాలని సూచించారు. విద్యార్థుల క్షేమమే ముఖ్యమని గ్రహించాలన్నారు.

ఎంపీడీవో పర్యటన

కోటగిరి,అక్టోబరు31(ఆంధ్రజ్యోతి): మండలంలోని సుద్దులంతండా ప్రాథమిక పాఠశాలను శుక్రవారం ఎంపీడీవో విష్ణు తనిఖీ చేశారు. పాఠశాల రికార్డులను, విద్యార్థుల్లో అభ్యాసన ప్రమాణాలను పరిశీలించారు. అనంతరం ఎక్లాస్‌పూర్, రాంపూర్, సుద్దులం, సుద్దులం తండా గ్రామాలలో ఇందిరమ్మ ఇళ్లు, నర్సరీలను పరిశీలించారు. ఆయన వెంట ఎంపీవో క్యాకప్ప, పంచాయతీ కార్యదర్శులు హన్మంత్ రావు, స్వాతి తదితరులున్నారు.

'డబుల్' లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ


రుద్రూర్‌లో చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

రుద్రూరు,అక్టోబరు31(ఆంధ్రజ్యోతి): రుద్రూర్ మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల లబ్ధిదారులకు బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి బాన్సువాడలో తన నివాసంలో శుక్రవారం చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అరుణ్ కుమార్, నాయకులు రాము, బాల్‌రాజ్, లక్ష్మణ్, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

వర్ని: వర్ని మండలానికి చెందిన 24 మంది ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి శుక్రవారం బిల్లులు పంపిణీ చేశారు. పాత వర్ని, జాకోరా, సత్యనారాయణపురం గ్రామాలకు లబ్ధిదారులకు రూ.81.41 లక్షలను చెక్కుల రూపంలో అందజేశారు. కార్యక్రమంలో ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాలరాజు, దండ్ల బాలరాజు, మార్కెట్ కమిటీ చైర్మన్ సురేష్ బాబా, కృష్ణగిరి, రంజ్యానాయక్ పాల్గొన్నారు.

స్పందించి.. ఎల్‌వోసీ అందించి


బాధిత కుటుంబీకులకు ఎల్‌వోసీని అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి

భీమ్‌గల్ రూరల్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బాబాపూర్‌కు చెందిన సయ్యద్ హయత్ రోడు ప్రమాదంలో తీవ్రంగా గాయపడడంతో హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో చేర్పించారు. వైద్యులు పరిశీలించి మెరుగైన వైద్యం కోసం రూ.లక్ష ఖర్చు అవుతుందని కుటుంబీకులకు తెలపడంతో ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. శుక్రవారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. అడిగిన వెంనే ఎల్‌వోసీ మంజూరు చేయించిన ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలియజేశారు.

షకీల్‌ను కలిసిన బీఆర్‌ఎస్ నేతలు


మాజీ ఎమ్మెల్యే షకీల్‌ను సన్మానిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

నవీపేట,అక్టోబరు31(ఆంధ్రజ్యోతి): బోధన్ మాజీ ఎమ్మెల్యే షకీల్‌ను శుక్రవారం మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన బీఆర్ఎస్ నాయకులు హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. విదేశాల నుంచి ఇటీవల హైదరాబాద్ చేరుకున్న షకీల్‌ను వారు మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరదలతో బోధన్ నియోజకవర్గంలో పంటలు దెబ్బతిన్నాయని ఈ విషయంలో పలువురు రైతులు తీవ్రంగా నష్టపోయ్యారని వారు షకీల్‌కు వివరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పోశెట్టి, రమేష్, తాహెర్ బిన్ జాఫర్, యూసుఫ్, నయీం తదితరులు పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి

మోస్రా,అక్టోబరు31(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు మెనూ ప్రకారం మధ్యాహ్నం భోజనం అందించాలని బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో పాఠశాల సిబ్బందిని ఆదేశించారు. మండల కేంద్రంలో జిల్లా పరిషత్ పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరు పట్టిక, మూల్యాంకనాలతో సహా పాఠశాల రికార్డులను ఆయన పరిశీలించారు. ఆయన విద్యార్థులతో వారి విద్యాపురోగతి గురించి మాట్లాడారు. విద్యార్థుల అభ్యాస ఫలితాలను ఎలా మెరుగుపర్చాలో పాఠశాల ఉపాధ్యాయ బృందానికి సలహాలు సూచనలు ఇచ్చారు. అదే విధంగా ఉపాధ్యాయ హాజరు రిజిష్టర్లను పరిశీలించారు. కార్యక్రమంలో మండల విద్యావనరుల అభివృద్ధి అధికారి నాగనాథ్, పాఠశాల హెచ్ఎం సాయిలు, బాలాజీ రావ్, రాజేశ్వర్ తదితరులు ఉన్నారు. అనంతరం సహకార సంఘం కార్యాలయాన్ని సందర్శించి కార్యదర్శి శేఖర్‌తో మాట్లాడి పూర్తి వివరాలు తెలుసుకుని ట్రక్ షీట్‌లను పరిశీలించారు. ట్యాబ్‌లో బిల్లులు ఎంత వరకు పూర్తి చేశారని ట్యాబ్‌లో చూశారు. రైతులకు సకాలంలో డబ్బులు పడే విధంగా ఆన్‌లైన్ తొందరగా చేయాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఏవో వెంకటేష్, ఏఈవో సప్తగిరి, సహకార సంఘం అధ్యక్షుడు మోహన్ రెడ్డి, కార్యదర్శి శేఖర్, తహసీల్దార్ కార్యాలయం సిబ్బంది ఉన్నారు.


హాజరు పట్టికను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్


ఇస్సాపల్లి శివారులో ప్రమాదకరంగా మారిన భారీ గుంత

ప్రయాణం.. ప్రాణసంకటం

ఆర్మూర్, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన భారీ వర్షాలకు రోడ్లు గుంతలమయమయ్యాయి. దీంతో వాహనదారులు రాకపోకలకు ఇబ్బందులు తప్పడం లేదు. ఆర్మూర్ నుంచి ఆలూర్ వెళ్లే దారిలో పెద్ద గుంత ఏర్పడి వర్షపునీరు నిల్వడంతో వాహనదారులు అవస్థలు పడుతున్నారు. గత నెలలో కురిసిన వర్షాలకు రోడ్లు ధ్వంసం కాగా ఇటీవల కురిసిన భారీ వర్షానికి గుంతలు మరింత పెద్దవయ్యాయి.. అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేయించాలని వాహనదారులు కోరుతున్నారు.


వేల్పూర్ అంగడి బజార్‌లో భగీరథ పైప్‌లైన్ పరిస్థితి

భగీరథ.. ఇదేం వ్యథ

వేల్పూర్, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని అంగడి బజార్ స్థలంలో మిషన్ భగీరథ పైప్‌లైన్ లీకవుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని స్థానికులు పేర్కొంటున్నారు. 8 నెలల నుంచి పైప్‌లైన్ నుంచి నీరు వృథాగా వెళ్తూ సంత స్థలంలోకి చేరి బురదమయంగా మారుతోందన్నారు. ప్రతీ శుక్రవారం జరిగే వారసంతకు వచ్చే ప్రజలు, వ్యాపారులు అవసలు పడుతున్నారని పేర్కొన్నారు. ఇప్పటికైనా మిషన్ భగీరథ అధికారులు స్పందించి లీకేజీలను అరికట్టాలని కోరుతున్నారు.


రికార్డులను తనిఖీ చేస్తున్న సబ్ కలెక్టర్

నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

- సబ్ కలెక్టర్ అభిజ్ఞాన్ మాల్వియా

ఆలూర్, అక్టోబరు31(ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోళ్లలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సబ్ కలెక్టర్ అభిజ్ఞాన్ మాల్వియా హెచ్చరించారు. మండలంలో సబ్ కలెక్టర్ ఆకస్మికంగా పర్యటించి, ప్రాథమిక వ్యవసాయ సంఘ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. ధాన్యం కొనుగోళ్ల వివరాలు పరిశీలించారు. ఆయన వెంట ఏడీఏ విజయలక్ష్మి, పీఏసీఎస్ చైర్మన్ శ్రీనివాస్, తహసీల్దార్ రమేష్, ఎంపీడీవో గంగాధర్, ఏవో రాంబాబు, క్లస్టర్ ఆఫీసర్ స్వప్న, డీటీ వినోద్‌కుమార్, సొసైటీ డైరెక్టర్ ప్రమోద్, సెక్రటరీ మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.



ఎన్‌సీసీ క్యాడెట్లకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

రోడ్డు భద్రతపై అవగాహన

ఎడపల్లి, అక్టోబరు31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జానకంపేట శివారులోని కమిషనరేట్ ట్రైనింగ్ సెంటర్‌లో ఎన్‌సీసీ క్యాడెట్ శిక్షణ శిబిరాన్ని ట్రాఫిక్ ఏసీపీ మస్తాన్ అలీ శుక్రవారం సందర్శించారు. క్యాడెట్స్‌కు ట్రాఫిక్ రూల్స్, షీ టీంపై అవగాహన కల్పించారు. మద్యం తాగి వాహనాలు నడపరాదని, అన్ని పత్రాలు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. మహిళల రక్షణకు షీ టీం నిరంతరం శ్రమిస్తుందన్నారు. వేధింపులకు గురైతే 100కు డయల్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో క్యాంప్ కమాండెంట్ లెఫ్టినెంట్ కల్నల్ ప్రియజిత్‌సూర్, ఆడమ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కల్నల్ విష్ణుప్రసాద్‌నాయర్, ఎన్‌సీసీ అధికారులు, క్యాడెట్లు పాల్గొన్నారు.



మోర్తాడ్‌లో 2 కే రన్ పాల్గొన్న పోలీసులు


జక్రాన్‌పల్లిలో ఎస్‌ఐ ఎండీ రహ్మాన్ ఆధ్వర్యంలో ర్యాలీ


మెండోరలో ర్యాలీలో ఎస్‌ఐ సుహాసిని, యువకులు



భీమ్‌గల్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

ఐక్యతకు అడుగులేశారు..

సర్దార్ వల్లభాయ్ పటేల్ స్ఫూర్తితో యువత ఐక్యతను చాటుతూ ముందుకెళ్లాలని పోలీసులు పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా పోలీసు శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకుని యూనిటీ రన్ నిర్వహించారు. చిన్నచిన్న రాజ్యాలను ఒకతాటిపైకి తెచ్చిన ఘనత సర్దార్ వల్లభాయ్‌పటేల్‌కే దక్కుతుందని వక్తలు పేర్కొన్నారు. ఆయన స్ఫూర్తితో ప్రతి ఒక్కరు ముందుకెళ్లాలని సూచించారు. - ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్


కోటగిరిలో 2కే రన్ నిర్వహిస్తున్న దృశ్యం


2కే రన్ సందర్భంగా మాట్లాడుతున్న బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో



రెంజల్‌లో 2కే రన్ ప్రారంభిస్తున్న ఎస్‌ఐ చంద్రమోహన్



నవీపేటలో రన్ ఫర్ యూనిటీ కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, విద్యార్థులు


సాలూర క్యాంప్‌లో రన్‌లో పాల్గొన్న బోధన్ రూరల్ ఎస్‌ఐ మచ్చేందర్ రెడ్డి



ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి మార్కవుట్ ఇస్తున్న అధికారులు

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో వేగం పెంచండి

పెద్దకొడప్‌గల్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆయా గ్రామాల్లో ఇందిరమ్మ పథకం కింద ఇళ్ల నిర్మాణం చేసుకుంటున్న లబ్ధిదారులు నిర్మాణంలో వేగం పెంచాలని మండల ప్రత్యేక అధికారి కిషన్ సూచించారు. శుక్రవారం మండలంలోని పోచారం గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని పరిశీలించారు. గ్రామంలో లబ్ధిదారులకు సంబంధించిన ఇళ్ల నిర్మాణం కోసం మార్కవుట్ వేశారు. ఈ సందర్భంగా కిషన్ మాట్లాడుతూ ప్రభుత్వం ఇల్లు లేని పేద ప్రజల కోసం ఇందిరమ్మ పథకం కింద ఇళ్లను మంజూరు చేస్తుందని, ఇండ్లు మంజూరు అయిన లబ్ధిదారులు తొందరగా ఇళ్లు నిర్మాణం చేసుకోవాలని సూచించారు. ఇండ్లు నిర్మించుకుంటున్న లబ్ధిదారులకు ప్రభుత్వం విడతల వారీగా డబ్బులు అందజేస్తుందని, లబ్ధిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో అభినవ్ చందర్, ఎంపీవో లక్ష్మీకాంత్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి భాను చందర్ తదితరులు పాల్గొన్నారు.

షూటింగ్ స్పాట్‌గా సిద్ధరామేశ్వర ఆలయ మెట్ల బావి

- ఉదయం నుంచి కొనసాగిన వెబ్ సీరిస్ షూటింగ్
- తిలకించేందుకు పెద్దఎత్తున తరలివచ్చిన స్థానికులు
- ఆకర్షణగా నిలిచిన గెటప్ శ్రీను



భిక్కనూరు, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): భిక్కనూరు మండలకేంద్రంలోని దక్షిణ కాశీగా బాసిల్లుతున్న సిద్ధరామేశ్వర ఆలయ పరిసరాలు షూటింగ్ స్పాట్‌గా మారాయి. ఆలయం ఎదుట గల మెట్లబావి(కోనేరు)లో శుక్రవారం యాక్టర్ గెటప్ శ్రీను ఆధ్వర్యంలో వెబ్‌సిరిస్ షూటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయమే ఆలయానికి చేరుకున్న చిత్ర యూనిట్ సభ్యులు ముందుగా ఆలయంలో స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం మెట్లబావిలో కొన్ని సన్నివేశాలు, పాట చిత్రీకరణ చేశారు. మెట్ల బావిపై నిలబడి యాక్టర్‌లను, డ్యాన్సర్‌లను గెటప్ శ్రీను ప్రోత్సహించగా, ఈ షూటింగ్ అంతటికి ఆయన ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఈ సందర్భంగా చిత్ర యూనిట్ సభ్యులు మాట్లాడుతూ వెబ్ సిరిస్ షూటింగ్‌లో బాగంగా ఇక్కడ కొన్ని సన్నివేశాలను తీయడం జరుగుతుందని, తమకు అనుకూలంగా ఈ ఆలయ పరిసరాలు, మెట్లబావి ఉండటంతోనే ఇక్కడ సినిమా చిత్రీకరణ చేయడం జరుగుతుందన్నారు. దీనికి ఇంకా టైటిల్ ఖరారు చేయలేదని తెలిపారు.

కొనుగోలు కేంద్రాల్లోనే మొక్కజొన్నను విక్రయించాలి

- సోమార్‌పేట్‌లో మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ప్రారంభం



మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న చైర్మన్, సీఈవో

మాచారెడ్డి, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): రైతులందరు కొనుగోలు కేంద్రాల్లోనే మొక్కజొన్నను విక్రయించాలని సింగిల్‌విండో చైర్మన్ స్వామిగౌడ్ అన్నారు. మండలంలోని సోమార్‌పేట్‌లో శుక్రవారం మొక్కజొన్న కొనుగోలు కేందాన్ని అయన ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని, రైతులు పండించిన ప్రతి గింజను ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలోనే విక్రయించాలన్నారు. ఒక క్వింటాల్ మొక్కజొన్నలకు రూ.2400లు ప్రభుత్వం చెల్లిస్తుందని, ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. రైతులకు కొనుగోలు కేంద్రాల వద్ద అన్ని ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో సీఈవో చంద్రారెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నర్సిలాల్ నాయక్, రైతులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న చైర్మన్

పాల్వంచ, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): పాల్వంచ మండలకేంద్రంతో పాటుగా ఫరిద్‌పేట్ గ్రామంలో మాచారెడ్డి సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం చైర్మన్ స్వామిగౌడ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు పల్లె రమేష్ గౌడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ రైతులకు కల్లాల్లో అన్ని సౌకర్యాలను ఏర్పాటు చేయడం జరిగిందని, కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రామస్వామి, భిక్షపతి, బాల్‌రాజ్‌గౌడ్, లక్ష్మారెడ్డి, గోపాల్‌రెడ్డి, చిన్నగంగయ్య, సత్యంరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఆకాశంలో మబ్బులు రైతుల గుండెల్లో గుబులు



వరి ధాన్యం కుప్పలపై పట్టాలు కప్పిన రైతులు

జుక్కల్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో రైతులు ఖరీఫ్ సీజన్లో సాగు చేసిన వరి ధాన్యం కోత కోసి రోడ్డుపై ఆరబోశారు. అకాల వర్షాలతో ధాన్యం కుప్పలు తడిసి ముద్దయ్యాయి. కొందరు రైతులు ధాన్యం తడవకుండా పట్టాలు కప్పారు. నాలుగు రోజుల నుంచి వర్షాలు కుర వడంతో ఆకాశంలో మేఘాలు మబ్బులు కావడంతో రైతుల గుండెల్లో గుబులు రేపుతుంది. భారీ వర్షాలకు ధాన్యం తడిసిపోతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

పటేల్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలి



పోలీసుల ఆధ్వర్యంలో టు కె రన్ నిర్వహిస్తున్న దృశ్యం

కామారెడ్డిటౌన్, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి వేడుకలను కామారెడ్డి జిల్లా కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. బీజేపీ జిల్లాశాఖ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. గ్రంథాలయంలో, ఆర్కే గ్రూప్ ఆఫ్ కళాశాలలు, రోటరిక్లబ్ ఆధ్వర్యంలో విద్యానగర్ కాలనీలో గల పటేల్ విగ్రహానికి, గ్రంథాలయంలో ఆయన చిత్రపటానికి పూల మాల వేసి నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ దేశానికి ఎనలేని సేవలను అందించి ఉక్కు మనిషి అనిపించుకున్నారని, అనేక సంస్థానాలను దేశంలో విలీనం చేసి దేశాన్ని ఏకం చేశారన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ చైర్మన్ మద్ది చంద్రకాంత్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర నాయకుడు మురళీధర్ గౌడ్, జిల్లా అధ్యక్షుడు నీలం చిన్నరాజులు, ఆర్కే కళాశాలల సీఈవో జైపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

తాడ్వాయి: మండల కేంద్రంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి అలాగే ఇందిరాగాంధీ వర్ధంతిని కాంగ్రెస్ నాయకులు నిర్వహించారు. అనంతరం వల్లభాయ్ పటేల్ ఇందిరా గాంధీ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. వారు చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. ఇందులో మండల అధ్యక్షుడు జూకంటి వెంకట్ రెడ్డి, సీనియర్ నాయకులు వెంకటరామిరెడ్డి, శ్యామ్ రావు, సంజీవ్, రామచంద్రం, గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

దోమకొండలో 2కే రన్

దోమకొండ: మండలంలోని సంగమేశ్వర్ బ్రిడ్జి నుండి సంగమేశ్వర్ చౌరస్తా వరకు పోలీసులు 2 కే రన్ నిర్వహించారు.ఈ సందర్భంగా ఎస్ఐ స్రవంతి మాట్లాడుతూ ఏక్తా దివాస్ స్పెషల్ రన్నింగ్ కార్యక్రమంలో భాగంగా రన్ చేపట్టామని తెలిపారు.

రాజంపేట: మండల కేంద్రంలో శుక్రవారం ఏక్తాదివాస్ సందర్భంగా విద్యార్థులు, పోలీసు సిబ్బంది ఉత్సాహంగా పాల్గొని 2కే రన్ నిర్వహించినట్లు ఎస్ఐ రాజు తెలిపారు.

పోలీసుశాఖ ఆధ్వర్యంలో 2కే రన్

భిక్కనూరు: మండలకేంద్రంలో ఉక్కుమనిషి, భారత మొదటి ఉప ప్రధాని సర్దార్ వల్లాబాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకుని పోలీసుశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం జాతీయ ఐక్యత దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పటేల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి పోలీసుస్టేషన్ వరకు 2కే రన్ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రకాంత్‌రెడ్డి, భిక్కనూరు సీఐ సంపత్‌కుమార్ మాట్లాడుతూ వల్లబాయ్ పటేల్ కృషి, సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో భిక్కనూరు ఎస్సై ఆంజనేయులు పాల్గొన్నారు.

తాడ్వాయి: వల్లబాయ్ పటేల్ 150వ జయంతి సందర్భంగా శుక్రవారం మండల కేంద్రంలో రాష్ట్రీయ ఏక్తా దివస్ను పురస్కరించుకొని టు కే రన్ కార్యక్రమాన్ని నిర్వహించారు.

మాచారెడ్డి: మండలకేంద్రంలో సర్దార్ వల్లబాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకుని శుక్రవారం పోలీసులు ఎస్సై అనీల్‌కుమార్ ఆధ్వర్యంలో 2కే రన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాచారెడ్డి ఉన్నత పాఠశాల నుంచి గజ్జి నాయక్ తాండా వరకు రన్ నిర్వహించారు.

సదాశివనగర్‌లో

సదాశివనగర్: మండలకేందరంలో ఎస్సై పుష్పరాజ్ ఆధ్వర్యంలో శుక్రవారం 2కే రన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. జాతీయ రహదారి నంది విగ్రహం నుంచి నేతాజీ విగ్రహం వరకు ర్యాలీగా వెళ్లి అక్కడి నుండి జాతీయరహదారి వరకు 2కే రన్ నిర్వహించారు. 2కే రన్‌లో యువత ఉత్సాహంతగా పాల్గొని రన్ నిర్వహించడం హరించదగ్గ విషయమన్నారు.

వల్లభాయ్‌ని ఆదర్శంగా తీసుకోవాలి

రామారెడ్డి, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): కామారెడ్డి జిల్లా కేంద్రానికి పది కిలోమీటర్ల దూరంలో ఉన్న ఏక్తా దివస్ సందర్భంగా సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి సందర్భంగా రామారెడ్డి ఎస్సై భువనేశ్వర్ రావు శుక్రవారం రన్నింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్దార్ వల్లభాయ్ పటేల్ అందరూ ఆదర్శంగా తీసుకోవాలని పలు సూచనలు పద్ధతులను అందజేశారు.

కామారెడ్డిలో క్యాండిల్ ర్యాలీ

కామారెడ్డిటౌన్: పోలీసు అమరవీరుల స్మారక వారోత్సవాల సందర్భంగా శుక్రవారం జిల్లా కేంద్రంలోని కొత్త బస్టాండ్ నుంచి డీఎస్పీ కార్యాలయం వరకు క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎస్పీ నరసింహరెడ్డి మాట్లాడుతూ దేశరక్షణ కోసం తమ ప్రాణాలను అర్పించిన పోలీసు అమరవీరుల మనకు ఎల్లప్పుడు ప్రేరణ అని వారి త్యాగాలను స్మరించుకోవడం ప్రతీ పౌరుడి బాధ్యతని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐ నరహరి, ఎస్పీ ఇన్‌స్పెక్టర్ మధు సూదన్, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్‌లు సంతోష్, నవీన్, కృష్ణ పాల్గొన్నారు.

భిక్కనూరులో

భిక్కనూరు మండలకేంద్రంతో పాటుగా మండలంలోని ఆయా గ్రామాల్లో వల్లభాయ్ పటేల్ జయంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండలకేంద్రంలోని కుమ్మరి గల్లీ ప్రాంతంలో గల పటేల్ విగ్రహానికి, ఆయాగ్రామాల్లో ఆయన చిత్రపటానికి నాయకులు, యువజన సంఘాల ప్రతినిధులు, అధికారులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

పటేల్ స్ఫూర్తితో ముందుకు సాగుదాం

పెద్దకొడప్‌గల్: దేశ ఐక్యత కోసం కృషి చేసిన ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ స్ఫూర్తితో ముందుకు సాగుదామని పెద్ద కొడప్ గల్ ఎస్సై అరుణ్ కుమార్ యువతకు పిలుపు నిచ్చారు. శుక్రవారం పెద్దకొడప్‌గల్ మండల కేంద్రంలో పటేల్ 150వ జయంతి ఉత్సవాల సందర్భంగా ఐక్యత దినోత్సవాన్ని పురస్కరించుకుని 2కే రన్‌ను జెండా ఊపి ప్రారంభించారు. ఈ సం దర్భంగా ఎస్సై మాట్లాడుతూ ఆనాడు దేశంలో అనేక రాష్ట్రాల్లో ఆయా రాజుల పాలన ఉంటే అటువంటి వారందరినీ రాజ్యాలను భారత దేశంలో విలీనం చేసిన ఘనత పటేల్‌దేనని తెలిపారు. నేటి యువత పటేల్‌ను స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో లక్ష్మీకాంత్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మహేందర్ రెడ్డి, నాయకులు నాగి రెడ్డి, రసూల్, రాంసింగ్ పాల్గొన్నారు.

పిట్లం: స్వాతంత్ర సమరయోధుడు నవభారత నిర్మాణ కృపకర్త ఉక్కు మనిషి భారతరత్న సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా కాంగ్రెస్ పార్టీ, పోలీసులు, బీజేపీ వారి ఆధ్వర్యంలో శుక్రవారం వేడుకలు నిర్వహించారు. తహసీల్దార్ రాజ నరేందర్ గౌడ్ మాట్లాడుతూ సర్దార్ వల్లభాయ్ పటేల్ 150 జయంతి సందర్భంగా అంబేద్కర్ చౌరస్తా నుంచి వెల్ఫేర్ నేషన్ నేకుతా కార్యక్రమం నిర్వహించి సర్దార్ వల్లభాయ్ పటేల్ విగ్రహం వరకు చేరుకొని పూల మాలలు వేసి నివాళులు అర్పించామన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు హనుమాన్లు, ఎస్సై వెంకట్రావు, విండో చైర్మన్ శపథం రెడ్డి, నాయకులు ఇమ్రోజ్, అశోక్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

మద్నూర్: మండల కేంద్రంలో సర్దార్ వల్లబాయి పటేల్ జయంతి సందర్భంగా పోలీసుల ఆధ్వర్యంలో పరుగు పోటీలను నిర్వహించారు. మద్నూర్ పోలీస్ స్టేషన్ నుంచి సలబత్పూర్ ఆంజనేయ ఆలయం వరకు రెండు కిలోమీటర్ల పరుగు పోటీ నిర్వహించారు. ఈ సందర్భంగా మద్నూర్ ఎస్సై మాట్లాడుతూ సామాజిక సందేశాలను తెలియ చేయడానికి టూకే రన్ పరుగు నిర్వహించ బడుతుందని తెలిపారు.

నాగిరెడ్డిపేట: దేశ ఐక్యతను చాటి చెప్పిన సర్దార్ వల్లబ్ భాయ్ పటేల్ జయంతి సందర్భంగా నాగిరెడ్డిపేట మండల కేంద్రంలో పోలీసుల ఆధ్వర్యంలో ఏకతా దివస్ ఐక్యతా రన్ కార్యక్రమం నిర్వహించారు.



భిక్కనూరు 2కే రన్ ప్రారంభిస్తున్న దృశ్యం



మాచారెడ్డిలో..



నాగిరెడ్డిపేటలో ..



సదాశివనగర్‌లో 2కే రన్ ప్రారంభిస్తున్న ఎస్సై



మద్నూర్ 2కే పరుగులో పాల్గొన్న విద్యార్థులు



రన్‌లో పాల్గొన్న ఎస్సై స్రవంతి



పెద్దకొడప్‌గల్‌లో పాల్గొన్న ఎస్సై అరుణ్



సర్దార్ వల్లభాయ్ పటేల్‌కు నివాళ్లు అర్పిస్తున్న దృశ్యం



క్యాండిల్ ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు

ఎక్సైజ్‌శాఖ ఆధ్వర్యంలో వాహనానికి బహిరంగ వేలం

బాన్సువాడ రూరల్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): బాన్సువాడ ఎక్సైజ్ కార్యాలయ ఆవరణలో నవంబరు 3న ఉదయం 11గంటలకు ఎక్సైజ్ డిప్యూటీ కమిషన్ ఆదేశాల మేరకు ఎక్సైజ్ కేసు నమోదు అయిన టీవీఎస్ ఎక్సెల్ ద్విచక్ర వాహనానికి బహిరంగ వేలం వేయనున్నట్లు ఎక్సైజ్ సీఐ దిలీప్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వేలం పాటలో పాల్గొనదల్చిన వారు పూర్తి వివరాల కోసం ఎక్సైజ్ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

బాధిత కుటుంబానికి చేయూత



బియ్యం అందజేస్తున్న కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు

పాల్వంచ, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): పాల్వంచ మండలంలోని బండ రామేశ్వర్‌పల్లి గ్రామంలో ఓ ఐదు రోజుల క్రితం మరణించి చెన్నబోయిన భాగవ్వ కుటుంబానికి పాల్వంచ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పల్లె రమేష్‌గౌడ్ శుక్రవారం 50కిలోల సన్న బియ్యాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ మీనా నాగరాజు, పోసు నర్సింలు, సత్యం, సిద్దరాములు, నవీన్, బాలు, శ్రీనివాస్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్ ఆలయ విగ్రహ ప్రతిష్ఠాపన



నూతనంగా నిర్మించిన హనుమాన్ ఆలయం

బాన్సువాడ రూరల్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): బాన్సువాడ మండలంలోని చిన్నరాంపూర్ గ్రామంలో నూతనంగా నిర్మించిన హనుమాన్ ఆలయ ప్రతిష్ఠాపన ఉత్సవాలు శనివారం నుంచి సోమవారం వైభవంగా నిర్వహించడం జరుగుతుందని ఆలయ కమిటీ సభ్యులు శుక్రవారం తెలిపారు.

నేడు ఎస్సీ, ఎస్టీ చైర్మన్ రాక

కామారెడ్డిటౌన్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): కామారెడ్డి జిల్లా కేంద్రానికి శనివారం రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమీషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య రానున్నారు. ఇటీవల పల్వంచ మండలంలో జరిగిన అ త్యాచార బాధితురాలిని పరామర్శించి అధికారులకు తగిన చర్యలు తీసుకోవాలని సూచనలు చేయనున్నారు.

కొనుగోలు కేంద్రం పరిశీలన

దోమకొండ, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): దోమకొండ మండలంలోని ఆయా గ్రామాల్లో శుక్రవారం మండల స్పెషల్ ఆఫీసర్ జ్యోతి, ఎంపీడీవో ప్రవీణ్‌లు కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు.ఈ సంద ర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు తమ వరి ధాన్యాన్ని తేమ శాతం వచ్చేంత వరకు ఆరబెట్టాలన్నారు.

నాగారంలో ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభించిన పోచారం, కాసుల



ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభిస్తున్న పోచారం

బాన్సువాడ రూరల్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): బాన్సువాడ మండలంలోని నాగారం గ్రామంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా నిర్మించిన ఇళ్లను శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి కార్పొరేషన్ చైర్మన్ కాసుల బాల్‌రాజుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో అయన మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేనివిధంగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణదారులకు రూ.5క్షల సాయాన్ని రాష్ట్ర ప్రభతుత్వం అందజేయడం జరుగుతుందన్నారు. ప్రతి పేదవాడికి ఇళ్లు అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ కృషితో పేదవారికి పక్కా గృహాలు అందజేయడం జరిగిందని, ఆయన స్ఫూర్తితో రాష్ట్ర ప్రభుత్వాలు పేదవారికి ఇండ్లను అందజేయడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా గ్రామస్థులు ధాన్యం కొనుగోలు కేంద్రంలో సొసైటీ నిర్వాహకులు ఇబ్బందులకు ఉగరిచేస్తున్నారని ఆయన దృష్టికి తీసుకురాగా 17శాతం తేమ ఉంటే ధాన్యాన్ని కొనుగోలు చేపట్టాలని, సన్నకారు రైతులను ఆదుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. తనకు పోచారం ఎంతో నాగారం కూడా అంతే అభిమానం అని అన్నారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇండ్ల యాజమానులు పోచారం, కాసులను, సబ్ కలెక్టర్ కిరణ్మయిని శాలుతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వరప్రసాద్, హౌసింగ్ డీఈ గోపాల్, ఎంపీడీవో ఆనంద్, ఎంపీవో సత్యనారాయణరెడ్డి, పీఆర్ ఏఈ గోపీనాథ్, సూపరింటెంట్ ముజాహిద్, ఏఈ నితిన్‌గౌడ్, పంచాయతీ కార్యదర్శి నవీన్‌గౌడ్, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఇందిరాగాంధీకి ఘన నివాళి



రామేశ్వర్‌పల్లిలో ఇందిరాగాంధీ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న నాయకులు

భిక్కనూరు, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): దివంగత మాజీ ప్రధాని ఇందిరా గాంధీ వర్ధంతిని మండలకేంద్రంతో పాటుగా మండలంలోని ఆయా గ్రామాల్లో శుక్రవారం కాంగ్రెస్‌పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆయా గ్రామాల్లోని ఇందిరాగాంధీ విగ్రహాలకు, చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ చంద్రకాంత్‌రెడ్డి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఇంద్రకరణ్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు భీంరెడ్డి మాట్లాడుతూ ఇందిరాగాం ధీ చేసిన సేవలను కొనియాడారు.

మద్నూర్: ఉమ్మడి మద్నూర్ మండలంలోని మద్నూర్ డోంగ్లి మండలాల్లో కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు ఇందిరాగాంధీ వర్ధంతిని జరుపుకున్నారు. మద్నూర్ మండల కేంద్రంలో పార్టీ అధ్యక్షుడు ధరస్ సాయిలు, డోంగ్లి మండల పార్టీ అధ్యక్షుడు గజా నంద్ దేశాయి ఇందిరా గాంధీ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొని ఇందిరా గాంధీ చిత్రపటానికి పుష్పాం జలి ఘటించి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఆ లయ కమిటీ చైర్మన్ రామ్ పటేల్, మాజీ ఎంపీపీ ప్రజ్ఞా కుమార్, మాజీ సర్పంచ్ విట్టల్ గురూజీ, మాజీ ఎంపీటీసీ రాము లు, నాయకులు మాజీ కొండా గంగాధర్, హనుమాన్లు స్వామి పాల్గొన్నారు.

పిట్లం: భారతదేశపు మొదటి మహిళా ప్రధాని ఉక్కుమనిషి ఇందిరా గాంధీ వర్ధంతి వేడుకలు పిట్లంలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహిం చారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు హనుమాన్లు కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి ఇందిరాగాంధీ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. దేశానికి ఇందిరాగాంధీ చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో విండో చైర్మన్ శపథం రెడ్డి, కాంగ్రెస్ నాయకులు అశోక్, ఇమ్ము రోజ్, చంద్రశేఖర్, అద్వాన్, మోయిన్, మహ్మద్, హన్మాండ్లు, దత్తు, కాం గ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



మద్నూర్‌లో



పిట్లంలో ఘనంగా ఇందిరాగాంధీ వర్ధంతి వేడుకలు

ప్రమాణ స్వీకారానికి హాజరైన ఎమ్మెల్యే



అజారుద్దీన్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే

ఎల్లారెడ్డి రూరల్, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మంత్రి వర్గ విస్తరణలో భాగంగా రాష్ట్ర మంత్రిగా హైదరాబాద్‌లోని రాజ్‌భవన్‌లో నిర్వహించిన అజారుద్దీన్ ప్రమాణస్వీకారం కార్యక్రమానికి ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన అజారుద్దీన్‌కు ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలిపి సన్మానించారు. అజారుద్దీన్ క్రికెటర్‌గా ఉత్తమ ప్రతిభతో గొప్ప గుర్తింపు పొందాడని అనంతరం కాంగ్రెస్ పార్టీలో చేరి పార్టీ అభివృద్ధికి విశేష సేవలు అందిస్తున్నాడన్నారు. ప్రజా సేవలోనూ అతడికి అనుభవం ఉందన్నారు. మంత్రిగా రాష్ట్రానికి మేలైనా సేవలు అందిస్తారని, యువతకు ఆదర్శంగా నిలుస్తారని అన్నారు.

ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రైవేట్ కార్యక్రమాలు



తాడ్వాయి రైతు వేదికలో ప్రైవేట్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న దృశ్యం

తాడ్వాయి, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రభుత్వ రైతు వేదిక కార్యాలయంలో శనివారం ప్రైవేట్ కంపెనీకి సంబంధించిన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రైవేట్ సంబంధించిన కార్యక్రమం నిర్వహించడం ఏంటని పలువురు చర్చించుకుంటున్నారు. ఇటు అధికారులు అటు ప్రైవేట్ సంస్థలు ప్రభుత్వ కార్యాలయాల్లో కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని అంటున్నారు. ఈ ప్రైవేట్ కార్యక్రమానికి ప్రభుత్వ వ్యవసాయ అధికారులు ఆధ్వర్యంలో నిర్వహించడం ఏమిటని పలువురు రైతులు అంటున్నారు. ఇలా ప్రైవేట్ కార్యక్రమాలు ప్రభుత్వ కార్యాలయాల్లో నిర్వహిస్తే ఏవైనా ఇబ్బందులు తలెత్తితే రైతులకు ప్రభుత్వమే ఆదుకుంటుందా అని ప్రశ్నిస్తున్నారు. ఇదంతా అధికారులకు తెలిసే చేస్తున్నారని అనుకుంటున్నారు. వ్యవసాయ అధికారులకు ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రైవేట్ కార్యక్రమం ఏమిటని అడగగాపై అధికారుల అనుమతితో నిర్వహిస్తున్నామని చెప్పారు ఏది ఏమైనా మండలంలోని రైతులు ప్రైవేట్ సంస్థలు ప్రభుత్వ సంస్థలు రైతులకు ఏదో రకమైన మందులను అంటగడుతున్నారని అంటున్నారు. ఏదేమైనా ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రైవేట్ కార్యక్రమంలో నిర్వహించడమేమి టని పలువురు మండలంలో చర్చించుకుంటున్నారు.

ఫిజియోథెరపీని సద్వినియోగం చేసుకోవాలి

▸▸ డాక్టర్ సృజన్ కుమార్



చిన్నారులకు చికిత్స నిర్వహిస్తున్న డాక్టర్ సృజన్ కుమార్

రామారెడ్డి, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): కామారెడ్డి జిల్లా కేంద్రానికి పది కిలోమీటర్ల దూరంలో ఉన్న రామారెడ్డి మండల కేంద్రంలో శుక్రవారం భవిత కేంద్రంలో దివ్యాంగ విద్యార్థిని, విద్యార్థులకు ఫిజియోథెరపీ చికిత్సలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సృజన్ కుమార్ ఆధ్వర్యంలో పిల్లలకు చికిత్స అందించారు. ఈ సందర్భంగా మండల విద్యాశాఖ అధికారి నిట్టూరి ఆనంద్ రావు విద్యార్థుల తల్లిదండ్రులను ఉద్దేశించి మాట్లాడుతూ క్రమం తప్పకుండా రిజియోథెరపీ నిర్వహించినట్లయితే విద్యార్థుల వైకల్యాన్ని కొంత మేరకు తగ్గించి వారిని సాధారణ విద్యార్థుల మాదిరిగా వారి కార్యక్రమాలు చేసుకోవడానికి ఉంటుందని తెలిపారు. ఇలాంటి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోగలరని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో భవిత ఉపాధ్యాయుడు రమేష్, శ్రీనివాస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఏఐటీయూసీ ఆవిర్భావ వేడుకలు



జెండా ఎగురవేస్తున్న రాములు

బాన్సువాడ రూరల్, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): బాన్సువాడ పట్టణంలోని మాత శిశు ఆసుపత్రి ఆవరణలో ఏఐటీయూసీ 106వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ దుబాసి రాములు జెండా ఎగుర వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఐటీయూసీ పోరాటాల ఫలితంగానే కార్మికులకు కనీస వేతనాలు, పీఎఫ్, ఈఎస్ఐ తదితర చట్టాలు అమలులోకి వచ్చాయన్నారు. కార్మికుల ఐక్యతతో తమ పోరాటాల ఫలితంగా సమస్యలను పరిష్కరించుకుందామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రతినిధులు సయ్యద్, కుమార్, రేణుక, సురేఖ, సాయిలు, సంతోష్‌గౌడ్, రాజేశ్వరీ, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

మహిళలను కోటీశ్వరులను చేయడమే ప్రభుత్వ లక్ష్యం



ఎల్లారెడ్డిలో మాట్లాడుతున్న సీఆర్పీ శోభారాణి

ఎల్లారెడ్డి రూరల్, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డి ప్లన కేంద్రంలోని మండల సమైఖ్య భవనంలో శుక్రవారం మండల సమైఖ్య ప్రత్యేక సమావేశం సీఆర్పీ శోభారాణి ఆధ్వర్యంలో నిర్వహించారు. గ్రామ సంఘం, చిన్న సంఘం సమైఖ్యలో పుస్తకాల నిర్వహణ, ఆర్థిక అంశాలపై, ఆదాయ అభివృద్ధి, వ్యాపారాలపై మహిళలకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హైదరాబాద్ సెర్ప్ విభాగం నుంచి హైజరైనా అధికారిణీ భారతి మాట్లాడుతూ ప్రభుత్వ మహిళలను కోటీశ్వరులను చేయాలని సంకల్పంతో ఉందని, ఒక యూనిట్‌గా పనిచేస్తూ మహిళా సంఘాలను బలోపేతం చేయాలని, మహిళల అభివృద్ధికి కృషిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీఆర్‌డీవో విజయలక్ష్మీ, సమాఖ్య అధ్యక్షురాలు విజయలక్ష్మీచ ఏపీఎం రాంనారాయణగౌడ్, సీసీలు, సిబ్బంది, గ్రామసంఘాల అధ్యక్షులు, సభ్యులు పాల్గొన్నారు.

హనుమాన్ ఆలయంలో శ్రమదానం



భిక్కనూరు హనుమాన్ ఆలయంలో శ్రమదానం చేస్తున్న యువకులు

భిక్కనూరు, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): భిక్కనూరు మండలంలోని సిద్ధరామేశ్వర నగర్ గ్రామంలో గల హనుమాన్ ఆలయంలో శుక్రవారం యువకులు శ్రమదానం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలోని పరిసరాలను శుభ్రం చేసి పిచ్చిమొక్కలను తొలగించి గడ్డి మందను స్ప్రే చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆలయంలో ఇటీవల పిచ్చిచెట్లు మొలకెత్తి ఆలయం అధ్వానంగా మారడంతో శ్రమదానం చేసి ఆలయ పరిసరాలను శుభ్రం చేయడం జరిగిందన్నారు. ఆలయాన్ని శుభ్రం చేసిన యువకులను గ్రామస్థులు అభినందించారు. ఈ కార్యక్రమంలో బోనాల నాగరాజు, పుట్ట భూషణం, విటబోయిన నవీన్, సిద్ధూ పాల్గొన్నారు.

గాలికుంటు నివారణ టీకాలు వేయించాలి



మొగాలో పశు వైద్య శిబిరాన్ని ప్రారంభించిన మార్కెట్ ఉపాధ్యక్షుడు

మద్నూర్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : రైతులు తమ పశువులకు తప్పనిసరిగా గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలని మద్నూర్ మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు పరమేష్ పటేల్ అన్నారు. శుక్రవారం డోంగ్లి మండలంలోని మొగ గ్రామంలో పశు వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గాలికుంటు వ్యాధి అతి సూక్ష్మ క్రిముల వైరస్ వల్ల వస్తుందని రైతులు తమ పశువులను గాలికుంటు నివారణ వ్యాధి నుంచి రక్షించుకోవడానికి టీకాలు వేయించుకోవాలని కోరారు. పశు సంరక్షక శాఖ ఆధ్వర్యంలో పశువులకు గాలి కుంటు వ్యాధి నిరోధక టీకాలు వేయడం జరుగుతుందని తెలిపారు. ఈ పశు వైద్య శిబిరంలో గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు వేసిన పశువుల వివరాలను పశు వైద్యులు వినీత్ వెల్లడించారు. ఆవులు 109, ఎడ్లు 52, గేదెలు 45, దూడలు, లేగలు 37 మొత్తం 240 పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సయ్యద్ మున్వీర్ అలీ పశువైద్య సహాయకులు, జి.శేఖర్ దావకాన సాయకుడు, జి సైయాజీ గోపాలమిత్ర, జె నాగనాథ్ గోపాలమిత్ర, కె చంద్రశేఖర్ పశు మైత్రి, మొఘ గ్రామస్థులు పాల్గొన్నారు.

భూభారతి దరఖాస్తులు త్వరగా పరిష్కరించాలి



సిబ్బందితో సమీక్షిస్తున్న కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి

ఇందల్వాయి, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): భూభారతి పెండింగ్ దరఖాస్తులను వేగవంతంగా పరిష్కరించాలని కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి ఆదేశించారు. శుక్రవారం ఆయన ఇందల్వాయి తహసీల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. తహసీల్దార్, ఇతర సిబ్బందితో భూభారతి, స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ పూర్వ ప్రక్రియ అమలుపై సమీక్ష నిర్వహించారు. భూభారతి రెవెన్యూ సదస్సులలో వచ్చిన దరఖాస్తుల గురించి ఆరా తీశారు. దరఖాస్తులు తిరస్కరణకు గురైతే అందుకు గల కారణాలు స్పష్టంగా పేర్కొనాలన్నారు. సాదా బైనామా, పీఓటీలకు సంబంధించిన అప్లికేషన్‌లను క్షుణ్ణంగా పరి శీలన జరపాలని, వెంటవెంటనే నోటీసులు జారీ చేస్తూ, క్షేత్రస్థాయిలో వెరిఫికేషన్ నిర్వహించాలన్నారు. భూభారతి దరఖాస్తులకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, అర్జీల పరిష్కారంలో జాప్యం జరుగకుండా రోజువారీగా దరఖాస్తుల పరిశీలనను పర్యవేక్షిస్తూ, వేగవంతంగా వాటిని పరిష్కరించేందుకు చిత్త శుద్ధితో కృషి చేయాలని కలెక్టర్ సూచించారు. అదేవిధంగా ఎన్నికల సంఘం మార్గదర్శకాలను అను సరిస్తూ స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ పూర్వ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు. ఆయా కేటగిరీల వారీగా మ్యాపింగ్ నిర్వహిస్తున్న విధానాన్ని పరిశీలించి పలు సూచనలు చేశారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ వెంకట్‌రావు ఉన్నారు.

ఆలయ అభివృద్ధికి దాతల విరాళం



ఆలయ అభివృద్ధికి విరాళం అందజేస్తున్న దాత

మాచారెడ్డి, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): మాచారెడ్డి మండలంలోని చుక్కాపూర్ శ్రీ లక్ష్మీ నర్సింహా స్వామి ఆలయ అభివృద్ధికి కామారెడ్డి మండలం దేవునిపల్లి గ్రామానికి చెందిన అరుణ-లక్ష్మణ్ దంపతులు శుక్రవారం రూ.50వేలను అందజేసినట్లు ఆలయ కమిటీ చైర్మన్ కమలాకర్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి దాతలు స్వచ్ఛందంగా ముందుకు రావడం స్వామివారి కృప అని అన్నారు. అనంతరం దాత కుటుంబసభ్యులను సన్మానించి స్వామివారి లడ్డూ ప్రసాదం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఈవో ప్రభు రాంచంద్రం, అర్చకులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మొబైల్ అసోసియేషన్ కార్యవర్గం



నూతన కార్యవర్గాన్ని ఎన్నుకుంటున్న సభ్యులు

భిక్కనూరు, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): భిక్కనూరు మండల మొబైల్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ధన్నారపు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా సందీప్‌గౌడ్, కోశాధికారి గజ్జె వేణును సభ్యులు ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ కలిసికట్టుగా అసోసియేషన్ అభివృద్ధికి కృషిచేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సభ్యులు పాల్గొన్నారు.

పేదల కల సాకారం చేసేందుకు ఇందిరమ్మ ఇళ్ల పథకం

▸▸ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి



ఇందిరమ్మ ఇళ్లకు స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే భూపతిరెడ్డి

ఇందల్వాయి, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల పథకం పేదవాడి కలను సాకారం చేయనున్న సంక్షేమ యజ్ఞం అని రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద ఇల్లు లేని పేద కుటుంబాలకు కల నెరవేర్చే దిశగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని ఆయన పేర్కొన్నారు. శుక్రవారం ఇందల్వాయి మండలంలోని గన్నారం శివారులో హైవే పక్కన ఉన్న రెవెన్యూ భూమిని, జిల్లా కలెక్టర్‌తో కలిసి ఆయన పరిశీలించారు. ప్రభుత్వం రెండో విడతలో భాగంగా 75 గజాల స్థలాన్ని ఇచ్చి పేదలకు ఇళ్లు కట్టే ప్రణాళిక చేపట్టిందన్నారు. రెవెన్యూ అధికారులు తక్షణమే భూమి సర్వే పూర్తి చేసి కలెక్టర్ కు ప్రతిపాదనలు పంపాలని ఎమ్మెల్యే సూచించారు. కార్యక్రమంలో కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి, తహసీల్దార్ వెంక ట్రావు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు మునిపల్లి సాయిరెడ్డి, సంతోష్‌రెడ్డి, మాజీ ఎంపీపీ ఇమ్మడి గోపి, సొసైటీ చైర్మన్ గోపి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా పెద్దమ్మ తల్లి ఉత్సవాలు

ధర్పల్లి, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దుబ్బాకలో పెద్దమ్మతల్లి ఉత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. మూడు రోజుల పాటు జరిగిన ఉత్సవాల్లో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. జిల్లాలోనే మొదటిసారిగా అత్యంత వైభవంగా కోటిన్నర వ్యయంతో పెద్దమ్మ తల్లి దేవాలయాన్ని నిర్మించారు. ఇక్కడ ప్రతిష్ఠించిన అమ్మవారిని ప్రత్యేకంగా తీర్చిదిద్దారు. ముగింపు రోజైన శుక్రవారం రాష్ట్ర ముదిరాజ్ నాయకుడు ఇమ్మడి గోపి ఉత్సవాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు గోపిని సన్మానించారు.

లైన్ క్లియర్

(5వ పేజీ తరువాయి)

మెండుగానే ఉన్నట్లు అనుచరులు పేర్కొంటున్నారు. మలి విడత మంత్రి వర్గ విస్తరణలో చాన్స్ దక్కుతుందో లేదో చూడాలి.

షబ్బీర్‌అలీ ఆశలు గల్లంతు

ఉమ్మడి నిజామాబాద్ జిల్లా నుంచి కాంగ్రెస్‌లో సీనియర్ నాయకుడైన ప్రభుత్వ సలహాదారు, మాజీ మంత్రి షబ్బీర్‌అలీ ఆ పార్టీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి మంత్రి పదవి కోసం తీవ్ర ప్రయత్నాలు చేస్తూ వచ్చారు. గత అసెంబ్లీ ఎన్నికల్లోనూ కామారెడ్డి టికెట్ త్యాగం చేసిన షబ్బీర్‌అలీకి పదవి దక్కలేదు. దీంతో షబ్బీర్‌అలీతో పాటు ఆయన అనుచర గణం తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. మైనార్టీ కోటాలోనైన ఎమ్మెల్సీ ఇచ్చి మంత్రి పదవి కోసం తీవ్ర ప్రయత్నాలు చేసినా ఫలితం దక్కలేదు. సీనియర్ నేతగా గుర్తించి కాంగ్రెస్ అధిష్ఠానం షబ్బీర్‌అలీకి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ప్రభుత్వ సలహాదారుడిగా నియమించింది. ఈ పదవిలో గత రెండు సంవత్సరాలుగా ఆయన కొనసాగుతున్నా అసంతృప్తితోనే ఉన్నట్లు తెలుస్తోంది. ఇటీవల ఎమ్మెల్సీ కోటాలో అవకాశం దక్కుతుందని ఆయన అనుచరవర్గం భావించినా ఇది వరకు అధిష్ఠానం ఎమ్మెల్యే అవకాశం ఇవ్వలేదు. తాజాగా మైనార్టీకోటాలో అజారొద్దీన్‌కు మంత్రి పదవి దక్కడంతో షబ్బీర్‌అలీ ఆశలు దాదాపు నీరుగారాయి.

ప్రభుత్వ సలహాదారు సుదర్శన్‌రెడ్డికి సన్మానాలు



సుదర్శన్‌రెడ్డిని సన్మానిస్తున్న రాజిరెడ్డి

నిజామాబాద్, అక్టోబరు 31, (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల సలహాదారుడిగా నియమితుడైన బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డిని శుక్రవారం జిల్లాకు చెందిన పలువురు నేతలు హైదరాబాద్‌లో సన్మానించారు. రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి, జిల్లా సహకార బ్యాంకు చైర్మన్ రమేష్‌రెడ్డి, రాష్ట్ర రాష్ట్ర కోఆపరేటివ్ యూనియన్ అధ్య క్షుడు మానాల మోహన్‌రెడ్డి, నాయకులు నగేష్‌రెడ్డి, వేణుగోపాల్‌యాదవ్, తదితరులు హైదరాబాద్‌లో ఆయనను కలిసి సన్మానించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

సిరికొండ, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు సిరికొండ హైస్కూల్‌కు చెందిన మణిచరణ్, లిఖిత్ ఎంపికైనట్లు పీడీ అబ్బయ్య శుక్రవారం తెలిపారు. అండర్17 విభాగంలో నవీపేట్ హైస్కూల్లో జరిగిన ఎంపికల్లో ఇద్దరు విద్యార్థులు ఎంపికయ్యారన్నారు. మహబూబాబాద్ జిల్లా డోర్నకల్‌లో నవంబరు 2 నుంచి 4వ తేదీ వరకు జరిగే రాష్ట్ర స్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీలలో ఇద్దరు విద్యార్థులు పాల్గొంటారని పీడీ అబ్బయ్య తెలిపారు.

గుడిసె దగ్ధం

సిరికొండ, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సర్పంచ్ తండాలో శుక్రవారం ఉదయం మెగావత్ తార్య, సరోజ నివాసం ఉండే గుడిసె ప్రమాదవశాత్తు దగ్ధమైంది. విద్యుత్ షార్ట్ సర్క్యూ ట్ వల్ల నిప్పంటుకోగా తండాకు చెందిన వారందరూ వచ్చి మంటలు ఆర్పివేశారు.

సినిమా గైడ్

కామారెడ్డి

ప్రియ 70- కె- ర్యాంప్
ప్రియ 35- కాంతార
దర్శన్- బిసన్ కలమందన్

బాన్సువాడ

మహేశ్వరి డ్యూడ్
వెంకటేశ్వర కె- ర్యాంప్

చికెన్ ధరలు

రకం	సుగుణ	వెన్‌కాబ్
లైవ్	రూ.140	రూ.170
స్కిన్	రూ.200	రూ.210
స్కిన్‌లెస్	రూ. 220	రూ.230